తీరిన రైతుల సాగునీటి కష్టాలు

- అన్నదాతలకు అండగా వంశీమోహన్
- రూ. 5 కోట్ల సొంత నిధులతో మోటార్ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పోలవరం కాలువ నుంచి నీటిని పంపింగ్ చేస్తున్న మోటార్లు

గన్నవరం: నియోజకవర్గంలోని అన్నదాతలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అండగా నిలుస్తున్నారు. రైతుల సాగునీటి అవసరాలను తీరుస్తూ నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. సుమారు రూ. 5 కోట్లు తన సొంత ఖర్చుతో 350కి పైగా మోటార్లను ఏర్పాటు చేసి వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఈ మోటార్ల ద్వారా నీటి పంపింగ్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాను ప్రభుత్వం కల్పిస్తోంది. ఫలితంగా రైతులు ఏడాదికి రెండు పంటలు పండిస్తూ సంతోషంగా ఉంటున్నారు. నియోజకవర్గంలో పూర్తిగా వర్షాధారంపై ఆధారపడిన మెట్ట ప్రాంతంలో సుమారు 30 వేల ఎకరాల వరకు రైతులు సాగు చేస్తున్నారు. గతంలో వర్షాలు సంవృద్ధిగా పడితేనే రైతులకు పంట చేతికి వచ్చే పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో మహానేత వైఎస్సార్ పుణ్యమాని ఈ ప్రాంతంలో పోలవరం కాలువ అందుబాటులోకి వచ్చింది.

పోలవరం కాలువ ద్వారా నీటి పంపింగ్

2016 నుంచి పోలవరం కాలువ ద్వారా గోదావరి జలాలు నియోజకవర్గంలోని మెట్ట ప్రాంతంలో ప్రవహిస్తున్నప్పటికి రైతుల సాగునీటి అవసరాలు తీర్చే పరిస్థితి లేదు. దీంతో సాగునీరు లేక బాపులపాడు, గన్నవరం, విజయవాడ రూరల్ మండలాల్లో పంటలు ఎండిపోతున్న రైతుల కష్టాలను చూసిన వంశీమోహన్ చలించిపోయారు. రైతుల సాగునీటి అవసరాల నిమిత్తం ఎనిమిదేళ్ల క్రితమే ఆయన మోటార్లు కొనుగోలు చేసి నియోజకవర్గం పొడవునా పోలవరం కాలువ గట్లపై ఏర్పాటు చేశారు. తద్వారా గోదావరి జలాలతో మెట్ట ప్రాంతంలోని చెరువులను నింపి రైతులకు సాగునీటిని పూర్తిస్థాయిలో అందించారు. అయితే మోటార్ల ద్వారా నీటి పంపింగ్‌కు అప్పటి టీడీపీ ప్రభుత్వం అడుగడుగున అడ్డంకులు సృష్టించింది. అప్పటి ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు మోటార్ల ద్వారా నీటి పంపింగ్‌ను పలుమార్లు అడ్డుకున్నారు. అప్పట్లో అధికార పార్టీలో ఉండి కూడా వంశీమోహన్ ప్రభుత్వంపై పోరాడి రైతుల పక్షాన నిలిచారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తొలగిన అడ్డంకులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెట్ట ప్రాంత సాగునీటి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ తీసుకువెళ్లారు. పోలవరం కాలువ ద్వారా రైతులకు సాగు నీరందించేందుకు సీఎం సానుకూలంగా స్పందించడంతో అడ్డంకులు తొలగిపోయాయి. మోటార్లకు అవసరమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కూడా ప్రభుత్వం అనుమతించింది. ఫలితంగా గత ఐదేళ్లుగా పోలవరం కాలువ నుంచి మోటార్ల ద్వారా రైతులకు సాగునీటి సరఫరా కొనసాగుతోంది. మెట్ట ప్రాంతంతో పాటు డెల్టా మెరక పొలాలకు, విజయవాడ రూరల్ మండలంలోని బుడమేరు పరివాహక ప్రాంతాల్లోని పొలాలకు సాగునీరు అందించేందుకు వంశీమోహన్ మోటార్లను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు రబీతో పాటు దాళ్వా వరిసాగు, పలు ఆహార, వాణిజ్య పంటలను పండిస్తున్నారు. తమ సాగునీటి కష్టాలను తీర్చిన వంశీమోహన్‌కు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అన్నదాతలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మోటార్లు ఇచ్చి ఆదుకున్నారు



విజయవాడ రూరల్ మండలంలోని అంబాపురం, పి.నైనవరం గ్రామాల పరిధిలో దాళ్వా వరిసాగు చేస్తున్నాం. పెరిగిన ఎండల కారణంగా నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండేది. రైతుల కష్టాలను తెలుసుకున్న వంశీమోహన్ వెంటనే స్పందించి బుడమేరు కాలువ వద్ద విద్యుత్ మోటర్లను ఏర్పాటు చేయించారు. సకాలంలో సాగునీరు అందించడం వల్ల పంటలను కాపాడుకున్నాం.

– పులి బాబురావు, అంబాపురం రైతు

రైతుల పాలిట భగీరథుడు



మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ రైతుల పాలిట భగీరథుడు. గత ఎనిమిదేళ్లుగా మా గ్రామంలో రైతులు, కౌలు రైతులు పంటలు పండిస్తూ సుభిక్షంగా ఉన్నామంటే ఆయన చలువే. గ్రామంలో పోలవరం కాలువ నుంచి నీటిని తోడే పది మోటార్లు ఏర్పాటు చేసి ఏటా 350 ఎకరాలకుపైగా వరి పంటకు సాగునీరు అందిస్తున్నారు. గ్రామస్తులందరి తరుపున వంశీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– తూంపాటి రాంబాబు, కొత్తగూడెం రైతు

వంశీ మేలును మర్చిపోలేం



పోలవరం ఎడమ కాలువ, కృష్ణా–ఏలూరు కాలువ సాగునీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తు న్న రైతాంగం పాలిట వంశీ అపర భగీరథుడిగా నిలిచారు. గతంలో అదునుకు సాగునీరు అందక ఆరుగాలం కష్టించి పండించిన పంట నష్టపోవాల్సి వచ్చేది. దీంతో రైతుల కష్టాలను గుర్తించిన మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ ఉచితం విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేయడంతో ఎంతో ఊరట లభించింది. ఆయన చేసిన మేలును మర్చిపోలేం.

– పడకల వీర్రాజు, కె.సీతారామపురం రైతు

అభివృద్ధిని అడ్డుకునేందుకు టీడీపీ కుట్రలు



గన్నవరం: నియోజకవర్గంలో అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు టీడీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్ ప్రకటనకు ముందే చేపట్టిన పనులను కూడా నిలిపివేయాలంటూ ఎలక్షన్ అధికారులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. స్థానిక ఇస్లాంపేటలో సమస్యాత్మకంగా ఉన్న డ్రెయినేజీ అభివృద్ధికి ఈ నెల 11వ తేదీన ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. అనంతరం 12వ తేది నుంచి చేపల మార్కెట్ రోడ్డు నుంచి ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణ పనులు దాదాపు సగం పూర్తయ్యాయి. దీర్ఘకాలికంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరిస్తుండటంతో స్థానికులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది తట్టుకోలేని టీడీపీ నేతలు పదేపదే ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ తర్వాత పనులు ప్రారంభించారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు గురువారం విచారణ చేయగా ఎన్నికల కోడ్‌కు ఆరు రోజులకు ముందే పనులు చేపట్టినట్లు స్థానికులు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఆ పార్టీ నేతలు తమ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ తప్పుడు ఫిర్యాదుల కారణంగా నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలివేస్తే డ్రెయినేజీ సమస్య మరింత తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీ అడ్డుకున్నది టీడీపీనే

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేయడాన్ని ఓర్వలేక టీడీపీ నాయకులు అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని పీఏసీఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు కసుకుర్తి శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. దీన్ని విస్మరించిన టీడీపీ నాయకులు ఇళ్ల స్థలాల పంపిణీ వ్యవహారంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని 115 మంది లబ్ధిదారులను ఇళ్ల స్థలాల పంపిణీకి గుర్తించారని, దీని కోసం రెవిన్యూ అధికారులు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో పాట్ల విభజన, రోడ్ల అభివృద్ధి కూడా చేశారని తెలిపారు. కానీ టీడీపీ నాయకులు కోర్టు స్టే ద్వారా పంపిణీని నిలిపివేశారని చెప్పారు. గ్రామంలోని లబ్ధిదారులు ఈ వాస్తవ పరిస్థితులు తెలుసుకుని, టీడీపీపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి తప్పక బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. రంగన్నగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు తలారి ఈశ్వరరావు, సింగన్నగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్నాల లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, సముద్రాల పరిశుద్ధం, జొన్నలగడ్డ జోజి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పౌష్టికాహారం



వెల్దిపాడులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ వెంకటలక్ష్మి

నున్న(విజయవాడరూరల్): గర్భిణులు, బాలింతలు, తల్లులు చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల పౌష్టికాహారం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణకుమారి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం నున్న సెక్టార్ పరిధిలోని ప్రీస్కూల్ గర్భిణులు, బాలింతలు, తల్లులతో సూపర్‌వైజర్ సమావేశం నిర్వహించి చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల్లో అధికంగా పీచు పదార్థం ఉంటుందని, వాటిని తినడం వల్ల పోషక విలువలు లభించి గర్భిణులు, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిరుధాన్యాలతో స్వీట్లు, ఇడ్లీలు, దోసేలు ఇతర ఆహార పదార్థలు తయారు చేసుకుని తీసుకోవడం వలన ఆరోగ్యకరంగా ఉండవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కోటేశ్వరమ్మ, శ్యామలారాణి, లలిత, విజయరాణి, సుధారాణి, దేవరాణి, శ్రావణి, వరమ్మ, జ్యోతి, రత్నకుమారి, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఉంగుటూరు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందని, అంగన్‌వాడీల్లో అందజేసే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగించుకోవాలని ఐసీడీఎస్ గన్నవరం సీడీపీఓ వెంకటలక్ష్మి అన్నారు. వెల్దిపాడులో పౌష్టికాహార పక్షోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. రక్తహీనతను నివారించేందుకు ప్రతి ఒక్కరూ పోషకారాన్ని ప్రతి రోజూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్ పద్మాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై పర్యవేక్షణ ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీరమ్య

అంబాపురం(విజయవాడరూరల్): ఎన్నికల నియమావళి అమలు చేయడంలో సచివాలయ సిబ్బంది నిత్యం పర్యవేక్షణ ఉండాలని విజయవాడరూరల్ మండల ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య అన్నారు. గురువారం ఎంపీడీఓ, ఈఓఆర్డీ అంబాపురం, జక్కంపూడిలో పర్యటించి ఎన్నికల నియమావళిపై సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీరమ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి

పెనమలూరు: ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ డి.రాజు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో వివరాలు తెలుపుతూ పెనమలూరు నియోజకవర్గ పరిధిలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కాని, వారి తరుపున ప్రచారం చేసే వ్యక్తులు కాని, బహిరంగ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, పోస్టర్లు అంటించరాదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించడానికి అయ్యే ఖర్చు సదరు వ్యక్తుల నుంచి వసూళు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ తెలిపారు. డిపో నుంచి నడుపుతున్న బస్సు సర్వీస్‌లకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలతో పాటు సమస్యలను 8790996090 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కానూరులో విద్యార్థి అదృశ్యం

పెనమలూరు: కానూరులోని ఓ ప్రైవేటు కాలేజీకి వచ్చిన విద్యార్థి అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల వివరాల మేరకు జగ్గయ్యపేటకు చెందిన సంగెపు స్వప్న తన కుమారుడు సంగెపు శ్రీరఘురామ్‌ను కానూరులోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్‌లో చేర్పించడానికి ఈ నెల 20వ తేదీన తీసుకువచ్చింది. అయితే కాలేజీ వద్దకు వచ్చిన తర్వాత శ్రీరఘురామ్ అదృశ్యమయ్యాడు. అతని కోసం వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లి స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..

పెనమలూరు: యనమలకుదురులో విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు డొంక రోడ్డుకు చెందిన కర్రా శివలక్ష్మి కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె కుమార్తె(16) ఎనిమిదో తరగతి చదువుతుంది. కాగా ఈ నెల 20వ తేదీన ఆ విద్యార్థిని ఇంటి నుంచి అదృశ్యమయింది. ఆమె కోసం వెతికిన ఆచూకీ తెలియలేదు. రెండు నెలల క్రితం కూడా తన కుమార్తె హైదరాబాద్‌కు వెళ్లిపోగా ఇంటికి తీసుకువచ్చామని, మరల హైదరాబాద్‌కు వెళ్లింటుందని, అక్కడి యువకుడితో పరిచయముందని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని విశ్వనాథం బజారులో నిర్వహిస్తున్న ఓ వ్యభిచార గృహంపై పోలీసులు గురువారం దాడి చేశారు. సీఐ హబీబ్‌బాషా తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విశ్వనాథం బజారులో ఓ ఇంటిలో వ్యభిచారం నడుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆ ఇంటిపై దాడులు నిర్వహించి ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. మహిళలు గరికపర్రు, విజయవాడ, నూజివీడు ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు. దాడిలో ఎస్ఐ గణేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



ఉయ్యూరు 12వ వార్డులో పర్యటిస్తున్న మంత్రి జోగి రమేష్



వడ్డె శోభనాద్రీశ్వరరావుతో మాట్లాడుతున్న జోగి రమేష్

మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 12వ వార్డులో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ఎందుకు రావాలి, జగనన్నే ఎందుకు సీఎం కావాలి అని వివరించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమం అందిందని తెలిపారు. అర్హతే కొలమానంగా పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా మళ్లీ జగనన్నే సీఎం అని ధీమా వ్యక్తం చేశారు. మాయ ప్రలోభాలకు లోనై దొంగల మాటలను విశ్వసిస్తే భావితరాలకు బంగారు భవిష్యత్తు ఉండదన్నారు. చంద్రబాబును నమ్మితే గోతిలో పడినట్టేనని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ అందాలన్నా, సంక్షేమ పాలన కొనసాగాలన్నా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్లు గోన మదన్, గుంజా సుధాకర్, డాక్టర్ జంపాన పూర్ణిమ, సర్పంచ్‌లు తుమ్మూరు సురేష్‌రెడ్డి, పొనుగుమాటి బాలస్వామి, స్థానిక నాయకులు కొండపల్లి రమేష్, వేగిరాతి శ్రీను, జి.రాంబాబు, వెన్నెల శ్రీను, త్రిపురం జాలేశ్వరరావు, మోహన్, హరినాథ్, ప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వడ్డెను కలిసిన మంత్రి జోగి రమేష్

మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావును మంత్రి జోగి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉయ్యూరులో గురువారం పర్యటిస్తున్న ఆయన ఇంటింటికీ వెళ్తున్న క్రమంలో మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు నివాసానికి వెళ్లారు. వడ్డెను కలిసి రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వడ్డె పలు సూచనలు చేశారు. పర్యటనలో కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. తొలుత ఆలయంలో గణపతి పూజ, సాయిబాబాకు సహస్ర పుష్పార్చన, అష్టోత్తరం, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో కొనప రాజు వర్గ ఆంజనేయ భజన సమాజం సభ్యులు షిర్డీ సాయి గానామృతం చేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు బాబీ, రావి ఈశ్వర్, సరోజిని, బాలకృష్ణ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రెడ్డిగూడెం, గంపలగూడెం మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ కె.రవి కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు జూన్ 12 నుంచి మోడల్ స్కూల్స్‌లో సీబీఎస్‌ఈ ఇంగ్లీష్ మీడియంలో ఉచితంగా బోధించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాల కోసం హెచ్‌టీటీపీఎస్://ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పత్రికా ప్రకటన

[illegible]

సత్తుపల్లి — గాదె హరేంద్రరెడ్డి, అడ్వకేట్

ది. 21-03-2024 — ఖమ్మం. సెల్: 9848022542

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రవి

గన్నవరం రూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ అనగాని రవి కోరారు. మండలంలోని కొండపావులూరు కల్యాణ మండపంలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను గడప గడపకు ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీదేనని అన్నారు. ఇదే సంక్షేమం మరింతగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ కార్యకర్తలు, నాయకులు వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాలు, భవిష్యత్‌లో మరింతగా సంక్షేమాన్ని సీఎం జగనన్న అందిస్తారని తెలపాలని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఆర్‌వీఆర్, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ కై లే శివకుమార్, పడమట సురేష్, ఉప్పుగంటి రాజేష్, ఓబిళనేని బ్రహ్మయ్య, రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి జలసూత్రం రామ్మోహనరావు, మేదినేని బాబు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో వేసవి ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణంలో కూల్ పెయింట్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవి ఎండ నుంచి భక్తులకు ఉపశమనం కలిగేలా దుర్గగుడి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు కాళ్లు కాలకుండా పలు చోట్ల కూల్ పెయింట్‌ను ఇప్పటికే వేశారు. ఘాట్‌రోడ్డులో ఓం టర్నింగ్ నుంచి చిన్న గాలి గోపురం వరకు, స్కానింగ్ పాయింట్ నుంచి మహామండపం వరకు, ఇటు మహామండపం లిఫ్టు నుంచి మహామండపం వరకు కూల్ పెయింట్ వేశారు. ఇక కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు గోశాల వైపున కాయర్ మ్యాట్‌ను వేసి భక్తులకు ఉపశమనం కల్పించారు. మరో వైపున ఎండ తీవ్రత ఎక్కువైనా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన సామగ్రి ఇప్పటికే ఆలయ ప్రాంగణానికి తరలించారు. మరో మూడు, నాలుగు రోజుల్లో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి కంకిపాడులో ఇంటింటి ప్రచారం

కంకిపాడు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కంకిపాడు పట్టణంలో శుక్రవారం నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని అంకమ్మతల్లి ఆలయం నుంచి ఇంటింటి ప్రచారం ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్ పాల్గొంటారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం వద్ద గురువారం దాతల సహకారంతో బాటసారులు, ప్రయాణీకులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. దాతలు అనంతగిరి సంపత్‌కుమార్, ఇందిరాదేవి, సుబ్రహ్మణ్యం, ప్రవల్లిక, అక్షయల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం నిర్వహించడానికి సహకరిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా ప్రారంభమైన బూసిమ్మతల్లి తిరునాళ్ల



ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో వేంచేసి ఉన్న బూసిమ్మ తల్లి తిరునాళ్ల వైభవంగా ప్రారంభమయ్యాయి. 15 రోజుల పాటు జరిగే తిరునాళ్లకు బుధవారం రాత్రి కూరాకుల వంశస్తులు అంకురార్పణ చేశారు. అమ్మవారు పల్లకిలో గురువారం గ్రామోత్సవం చేసుకుని ఆలయ ప్రవేశం చేశారు. ఆలయంలో కొలువుదీరిన తల్లిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు.

ట్రావెల్స్ యజమానిని మోసగించిన ఇదరిపై కేసు

పెనమలూరు: ట్రావెల్స్ యజమానిని మోసగించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు డీఎస్ఆర్ కాలనీకి చెందిన సోమిశెట్టి వెంకటదుర్గారావు కానూరులో లక్కీ కార్ ట్రావెల్స్ నడుపుతున్నాడు. అతనికి గత ఏడాది క్రితం గోలగాని చిరంజీవి, కొండపల్లి సాయినిఖిల్ పరిచయమయ్యారు. వీరిద్దరు వెంకటదుర్గారావును నమ్మించి ఆయన వద్ద ఉన్న మూడు కార్లు లీజుకు తీసుకున్నారు. ఆరు నెలలు పాటు కారు అద్దె సక్రమంగానే చెల్లించారు. గత మూడు నెలల నుంచి కారు అద్దె చెల్లించకపోవడంతో కార్ల కోసం అడుగగా కార్లను రూ. 7 లక్షలకు ఇతరుల వద్ద తాకట్టు పెట్టామని ఆ ఇద్దరు చెప్పారు. కార్లు కావాలంటే రూ. 7 లక్షలు వెంకటదుర్గారావునే కట్టమని ఇరువురు చెప్పడంతో తాను మోసపోయానని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో తానా ఫౌండేషన్, రోటరీ క్లబ్(ఉయ్యూరు) ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 250 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 80 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేయగా, మరో 14 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చల్లా సుధాకర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. గురువారం గవర్నర్‌పేటలోని 23వ డివిజన్ పార్టీ కార్యాలయంలో డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు(సురేష్) ఆధ్వర్యంలో సుధాకర్‌ను శాలువా కప్పి సత్కరించారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు(సురేష్), వడ్డీ వాసు, విక్కీ, శ్రీను పాల్గొన్నారు.